గుదిబండగా గుర్రపుడెక్క

- గుండేరు డ్రెయిన్‌లో దట్టంగా పేరుకుపోయిన గుర్రపుడెక్క
- ముందుకు కదలని నీరు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



చాట్రగడ్డవానిగూడెం-జోడుగూడెం వద్ద గుండేరు డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటికాడ

ఘంటసాల: గుండేరు డ్రెయిన్‌లో నిండిపోయిన గుర్రపుడెక్క రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. సాగునీరు సకాలంలో రాకపోవడంతో బోర్లు మీద ఆధారపడి నారమడులు పోసి కొందరు, నాట్లు కూడా వేశారు. మరికొందరు రైతులు ప్రకృతి కరుణకోసం ఎదురు చూస్తున్నారు. ప్రకృతి కరుణించడంతో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. అయితే మురుగు నీటి పారుదలకు డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆటంకంగా మారింది. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ప్రధాన డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటికాడతో నిండిపోవడంతో వర్షం నీరు పోయే మార్గం లేక పంట నీట మునిగిపోతుండటంతో రైతన్నల సంతోషం ఆవిరైపోతుంది.

15 వేల ఎకరాలకు పొంచిఉన్న ముప్పు..

ఘంటసాల మండలం అచ్చెంపాలెం నుంచి దాలిపర్రు వరకు గుండేరు డ్రెయిన్ పరిధిలో సుమారు 10 నుంచి 15 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ నీటిని పంట పొలాల సాగుకు కూడా వినియోగిస్తున్నారు. అయితే మండలంలోని చిట్టూర్పు నుంచి దాలిపర్రు వరకు గుండేరు ప్రవహించే ప్రదేశాల్లో ఘంటసాలపాలెం, చిట్టూర్పు గ్రామ సరిహద్దుల్లోని జోగుగూడెం- చాట్రగడ్డవానిగూడెం, ఘంటసాల-దేవరకోట గ్రామాల మధ్య, ఘంటసాల-బిరుదుగడ్డ, దాలిపర్రు-లక్ష్మీపురం గ్రామాల మధ్య ఉన్న వంతెనల వద్ద భారీగా గుర్రపు డెక్క, తూటికాడ పేరుకుపోయింది. దీంతో నీటిప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడి ఎగువన ఉన్న పొలాలు ముంపునకు గురవుతుండగా, దిగువ పొలాలకు నీరు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

రైతుల్లో ఆందోళన..

డ్రెయిన్లు, ప్రధాన కాల్వల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటికాడను తొలగించే చర్యలు చేపట్టకపోవడంతో ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. నీరు ప్రవహించక ఎగువన ఉన్న పొలాలు ముంపునకు గురికావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చివరి భూముల వరకు నీరు అందించేందుకు గుర్రపు డెక్క, తూటికాడ తొలగించేలా క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు జరగకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి..

కూటమి ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేల పెట్టుబడి సాయం అందకపోవడంతో అష్టకష్టాలుపడి, అప్పులు చేసి వరి పంట సాగు చేసుకుంటున్న రైతులు, కౌలు రైతులు డ్రెయిన్లు సక్రమంగా లేకపోవడంతో పంటలు నీట మునిగిపోవడంతో నిట్టూర్పులు విడుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖాధికారులు తక్షణమే స్పందించి రైతుల బాధలను అర్థం చేసుకుని డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటికాడను తొలగించి, పొలాలను ముంపు భారీ నుంచి రక్షించాలని కోరుతున్నారు. చివరిభూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

> **రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం..**
>
> గుండేరు డ్రెయిన్‌లో గుర్రపుడ డెక్క, తూటి కాడ తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదు. రెండు రోజుల్లో గుండేరు డ్రెయిన్‌లో వంతెనల వద్ద నిలిచిపోయిన గుర్రపు డెక్క, తూటి కాడ తొలగింపు పనులు ప్రారంభిస్తాం.
>
> – హరీష్, ఏఈ, డ్రెయినేజీ

క్లుప్తంగా

అన్న సమారాధన



మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో వేంచేసియున్న కోదండ రామస్వామి ఆలయం వద్ద షిరిడీ సాయిబాబాను స్మరిస్తూ మూడో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పశువుల చావిడి కూలి ఎద్దు మృతి



కోడూరు: భారీ వర్షం, ఈదురుగాలుల ప్రభావానికి పశువుల చావిడి కూలి ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన ముళ్లపూడి వెంకటేశ్వరరావు పశువుల చావిడి పైకప్పు బుధవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, భారీ వర్షానికి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. పశువుల చావిడి లోపల రెండు, మూడు గేదెలు ఉన్నాయి. అయితే చావిడి పైకప్పుకు వినియోగించిన పట్టీలు ఒక్కసారిగా కిందకు పడిపోవడంతో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఎద్దు, గేదెలు మృత్యువాత నుంచి బయటపడ్డాయి. ఎద్దు మృతి చెందడంతో వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. అధికారులు తమకు నష్టపరిహారం అందివ్వాలని కోరుతున్నారు.

ఎడతెరపి లేని వర్షం



కృత్తివెన్ను: మండలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం తెరపివ్వకపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. అధిక శాతం మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షం నీరు చేరడంతో కొన్ని చోట్ల ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. నారుమడుల్లోకి నీరు చేరడంతో రైతులు నీటిని బయటకు తోడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయంటున్న వాతావరణశాఖ హెచ్చరికలతో రైతుల్లో కలవరం మొదలయింది.

పంట కాలువలో గుర్రపడెక్క తొలగింపు



అవనిగడ్డ: మండల పరిధిలోని పలు వంతెనల వద్ద పేరుకుపోయిన గుర్రపడెక్క, చెత్త, వ్యర్థాలను తొలగించారు. మండల పరిధిలోని పులిగడ్డ లాకులు, సీతాయిలంక కాలిబాట వంతెన, అవనిగడ్డ ప్రధాన లాకుల వద్ద పేరుకుపోయిన తూడు, గుర్రపడెక్క, చెత్త, వ్యర్థాలను కూలీలతో తీయించారు. సాగునీటి ప్రవాహానికి అడ్డుపటంతో వీటిని తొలగించినట్టు, మూడు రోజుల నుంచి చేపట్టిన ఈ కార్యక్రమం గురువారంతో ప్రక్రియ పూర్తయిందని ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్ చెప్పారు. ఈ పనులను డ్రెయినేజీ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావుతో పాటు పలువురు ఏఈలు పర్యవేక్షించారు.

పొలాల్లో నీరు బయటకు పెట్టాలి



గూడూరు: విస్తారంగా కురిసిన వర్షాలకు పంట పొలాల్లో నిలిచిన నీరు బయటకు పోయేలా రైతులు ఏర్పాట్లు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.వి.శివప్రసాద్ రైతులను కోరారు. గురువారం తరకటూరులో క్షేత్రస్థాయిలో పరిస్థితులు సమీక్షించిన ఏఓ రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెద విధానంలో వరిసాగు చేపట్టిన రైతులకు వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. పొలాల్లో నీరు తగ్గిన తర్వాత కలుపు ఉన్నట్లయితే గడ్డి జాతి కలుపులైన ఊద, తుంగ, గరిక వంటి కలుపు మొక్కల నివారణకు మందులను పిచికారీ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు గళ్లా రామాంజనేయులు, హరిప్రసాద్, వీఏఏ రహంతుల్లా, రాజ్యలక్ష్మి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో బాధ్యతగా పని చేయండి

మునిసిపల్ కమిషనర్ వెంకటరామయ్య



సచివాలయాల అడ్మిన్లతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య

పెడన: అప్పగించిన పనులను సక్రమంగా చేయడంతో పాటు విధులను బాధ్యతగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య అన్నారు. గురువారం ఆయన తన చాంబర్లో పట్టణంలోని తొమ్మిది సచివాలయాలకు చెందిన అడ్మిన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్తి, నీటిపన్ను బకాయిలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. బకాయిలున్నవారికి నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే కొందరు ఒకసారి నోటీసు జారీ చేసి చేతులు దులుపుకున్నారని, అది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. రెండో నోటీస్ కూడా తక్షణం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆస్తి, నీటి పన్నులు వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం కన్నా, ముందు నుంచే పన్నుల వసూళ్లలో దృష్టి పెట్టాలన్నారు. అడ్మిన్‌లందరూ తప్పనిసరిగా ఉదయం 8 గంటలకే విధులకు హాజరు కావాలని ఆదేశించారు. మిగిలిన సిబ్బందిని కూడా వారి వారి విధుల పట్ల మరింత చైతన్యం చేయడం జరుగుతుందని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సుందరం, ఆయా సచివాలయాల అడ్మిన్లు పాల్గొన్నారు.

హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు నేత్ర శస్త్ర కిత్సలు

మచిలీపట్నంటౌన్: స్థానిక జిల్లా సర్వజన ఆస్పత్రిలో గురువారం రెండోసారి హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు నేత్ర శస్త్ర చికిత్సలు చేశారు. నేత్ర శస్త్ర చికిత్స నిపుణుడు, ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ జి.భానుమూర్తి నలుగురు రోగులకు గురువారం శస్త్ర చికిత్సలు చేశారు. హెచ్ఐవీతో బాధపడే రోగులకు నేత్ర శస్త్ర చికిత్సలను గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో చేయకుండా ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేసేవారు. హెచ్ఐవీవి బాధితులు నేత్ర శస్త్ర చికిత్సలకు వేలాది రూపాయలను వెచ్చించి విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. ఆస్పత్రి జీజీహెచ్‌గా రూపాంతరం చెందిన తర్వాత డాక్టర్ భానుమూర్తి రెండోసారి ఆస్పత్రిలో ఈ శస్త్రకిత్సలను చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భానుమూర్తి మాట్లాడుతూ మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి చరిత్రలోనే రెండోసారి తాను హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు నేత్ర శస్త్ర చికిత్సలు చేశానన్నారు. మొదటి విడతలో ఐదు గురికి, గురువారం నలుగురికి ఈ శస్త్ర చికిత్సలు చేశామన్నారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా జీజీహెచ్ లో ఉచితంగా నేత్ర శస్త్ర చికిత్సలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ భానుమూర్తి కోరారు.

చాగంటి దంపతులకు మంత్రి సత్కారం



చాగంటి కోటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంటౌన్: ప్రవచన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరానికి విచ్చేసిన ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులను రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. చాగంటి దంపతులను మంత్రి దుశ్శాలువాతో సత్కరించారు. తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల బాటలో పయనిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోతున్న వేళ ప్రజల్ని ఆధ్యాత్మికత వైపు నడిపించేందుకు కోటేశ్వరరావు చేస్తున్న కృషిని కొనియాడారు. మనుషుల్ని కట్టిపడేసే వాగ్ధాటి కలిగిన చాగంటి కోటేశ్వరరావు మన రాష్ట్రం వారు అని చెప్పుకోవడానికి గర్విస్తున్నానన్నారు. చాగంటి కోటేశ్వరరావును కలిసిన వారిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, న్యాయవాద గుమస్తాల సంఘం నాయకుడు పీవీ ఫణి కుమార్ తదితరులు ఉన్నారు.

28న ఉచిత కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంకలోని మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. వివరాల కోసం 94906 36466, 70936 17778 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్లు (ఐఓఎల్) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

21న దుర్గమ్మకు ఆషాఢ సారె

గణపేశ్వరం(నాగాయలంక): గ్రామంలోని శ్రీదుర్గా-శ్రీగణపేశ్వరస్వామి ఆలయాల్లో దుర్గాదేవికి ఈనెల 21న గురుపౌర్ణమి పురస్కరించుకుని భారీగా ఆషాఢ సారె వేడుక నిర్వహిస్తున్నట్టు ఎంపీటీసీ మాజీ సభ్యురాలు తలశిల స్వర్ణలత, లేబాక పద్మప్రియ గురువారం తెలిపారు. ఆలయ 108 కేజీల పసుపు కుంకుమలతో అర్చకులు పోతుకూచి సత్యనారాయణశాస్త్రి, నాగసాయి అమ్మవారికి సారె కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

భావదేవరపల్లిలో..

భావదేవరపల్లి(నాగాయలంక): ఆషాఢ మాసం పురస్కరించుకుని గ్రామంలోని శ్రీ అన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 21న ఆషాఢ సారె పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు గురువారం చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు జరుగుతుందని, అన్నపూర్ణాదేవికి భక్తిశ్రద్ధలతో సారె సమర్పణ కార్యక్రమం ఉంటుందన్నారు.

జోరుగా పేకాట!

మొవ్వ: మండలంలో కొద్ది రోజులుగా పేకాట జోరుగా సాగుతోంది. ప్రధానంగా మండల పరిధిలోని శివారు గ్రామాల్లో పేకాట నిత్యం జరుగుతున్నా అటు వైపు కన్నెత్తి చూడకుండా పోలీసులపై అధికార పార్టీ వర్గీయులు ఒత్తిడి తెస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. ప్రధానంగా కాజ గ్రామంలో సుమారు నెలన్నరకు పైగా రోజు క్రమంగా కోసు ఆడుతున్నారని, జూదరులు పెద్ద ఎత్తున గ్రామ శివారుల్లోని డొంకల్లో, మోటారు సావిడిల్లో ఆడుతున్నారని తెలుస్తోంది. ఘంటసాల, గూడూరు, బందరు ప్రాంతాల నుంచి జూదరులు గ్రామంలో తిష్ట వేస్తున్నట్లు సమాచారం. దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన ఎంపీపీ



బంటుమిల్లి: మండల పరిధిలోని బంటుమిల్లి, పెదతుమ్మిడి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంపీపీ వి.చినబాబు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో మాట్లాడి వర్షాకాలంలో జ్వరాలు, అంటువ్యాధులు తదితర వ్యాధులపై నమోదు అవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారి వివరాలు తెలుసుకుని అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. పీహెచ్‌సీల్లో పాము, కుక్కకాట్లకు సంబంధించి వ్యాక్సిన్లు 24 గంటలూ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. వర్షాకాలంలో డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. బంటుమిల్లి, పెదతుమ్మిడి వైద్యులు సౌందర్య, జయశ్రీ, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు బాధితుల గుర్తింపునకు సర్వే ప్రారంభం



బంటుమిల్లి: మండల పరిధిలోని బంటుమిల్లి, పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కుష్ఠుబాధితుల గుర్తింపునకు సర్వే కార్యక్రమం గురువారం ప్రారంభించినట్టు వైద్యులు సౌందర్య, జయశ్రీ తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఎటువంటి రక్త పరీక్షలు లేకుండా శరీరంపై ఉన్న మచ్చల ఆధారంగా వ్యాధిని గుర్తిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కుష్ఠువ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి, వ్యాధిని ఏలా గుర్తించవచ్చు తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధిపై అనుమానం ఉంటే మందులు స్థానిక పీహెచ్‌సీల్లో, వైద్య సిబ్బంది వద్ద ఉంటాయని తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చినప్పుడు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యులు సౌందర్య, జయశ్రీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం



బంటుమిల్లి: దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని అధ్యాపకుడు అరవింద్ సత్య అన్నారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ యువత సనాతన ధర్మాన్ని వీడి పశ్చాత్య పోకడలవైపు వెళుతున్న కారణంగా అనేక రకాల సమస్యలపాలవుతున్నారన్నారు. వివేకానందుడులాంటి మహాపురుషులు యువతకు చూపిన మార్గాన్ని అనుసరించాలన్నారు. విద్యార్థులకు సామాజిక పరిస్థితులపై అవగాహన ఉండలన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలను వీడియో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎంఈఓ బి.త్రిపురసుందరీదేవీ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణ కిషోర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ

సీనియర్ సివిల్ జడ్జి బాబూనాయక్



హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

అవనిగడ్డ: రోడ్డు ప్రమాదాలాల్లో ప్రాణాలను రక్షించుకునేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీనియర్ సివిల్ జడ్జి బాబూనాయక్ పేర్కొన్నారు. స్థానిక మండల లీగల్ కమిటీ ఆధ్వర్యంలో కోర్టు సెంటర్ నుంచి రాజీవ్‌గాంధీ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బాబూనాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించ వచ్చన్నారు. మరో న్యాయమూర్తి గోపీనాథ్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ త్రినాథ్, ఎస్ఐ రమేష్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామప్రసాద్, లోక్ అదాలత్ సభ్యుడు కొండవీటి ఈశ్వరరావు, న్యాయవాదులు అందె శ్రీరామకృష్ణమూర్తి, బడే వెంకట శేషగిరిరావు, ఇమ్మిడిశెట్టి లక్ష్మినారాయణతో పాటు పలువురు న్యామవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీమన్నారాయణుడి కల్యాణం



మంగళసూత్రాలు చూపుతున్న పండితులు

కోడూరు: వేదపండితుల మంత్రోచ్ఛరణలు..మంగళవాయిద్యాల మధుర స్వరాలు..భక్తుల హరినామ స్మరణ మధ్య శ్రీమన్నారాయణుడి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి స్వామివార్ల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు పంచరామ ఆగమ శాస్త్రబద్ధంగా ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. శ్రీమన్నారాయణ స్వామిని రాజకుమారుడిగా అలంకరించి కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. అమ్మవార్లను ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో స్వామివార్ల కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణంలోని వివిధ ఘట్టాల గురించి అష్టాక్షరీ స్వామిజీ, అష్టాక్షరీ బృందావనం స్వామిజీలు భక్తులనుద్దేశించిన అనుగ్రహభాషణ చేశారు. కోడూరుకు చెందిన పలువురు దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తజనం కల్యాణం తిలకించేందుకు తరలివచ్చారు. కల్యాణమూర్తులను ఆలయ మాడ వీధుల వెంట ఊరేగించారు.

ముగిసిన ఏకాహం..

తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రారంభించిన విష్ణు సహస్రనామ పారాయణ ఏకాహం గురువారం ఉదయంతో ముగిసింది. శ్రీమన్నారాయణుడి చిత్రపటానికి ప్రత్యేక హారతులిచ్చారు. కల్యాణమూర్తులకు శ్రీపుష్పయాగాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. నల్గొండ, కర్నూలు, విజయవాడ నుంచి వచ్చిన భక్తమండళ్ల సభ్యులు కోలాట భజనలు చేసి ఆకట్టుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాడి రైతుల సంక్షేమమే 'కృష్ణా మిల్క్' ధ్యేయం

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



నడుపూరు పాల ఉత్పత్తిదారులతో సమావేశమైన చైర్మన్ ఆంజనేయులు


పెడన: పాడి రైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ ధ్యేయమని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గురువారం ఆయన పెడన మండలం నడుపూరు, గూడూరు మండలం రామానుజోత్తర్లపల్లి గ్రామాల్లోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు మేలైన యాజమాన్య పద్ధతులు, మెరుగైన పశుపోషణకు సంబంధించి పలు సూచనలు చేశారు. పాల ఉత్పత్తి దారుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. పాల ఉత్పత్తిదారులకు ప్రతి నాలుగు మాసములకు 10 శాతం చొప్పున ధర వ్యత్యాసం (బోనస్) పంపిణీ చేస్తున్నామని, క్షీర బంధు, కల్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలతో పాటు పశువులకు ఉచితంగా పశు వైద్య శిబిరాలు, జలగ మందు అందిస్తున్నామని అన్నారు. సబ్సిడీపై 20 శాతం ప్రోటీన్ కలిగిన పశుదాణా, పశువులకు మేలుజాతి కృత్రిమ గర్భోత్పత్తి సేవలు రూ.50 కే అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ పాలకవర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్, గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘాల అధ్యక్షులు వెతుకూరి వెంకటేశ్వరరావు, ఆత్మూరి రత్నమోహన్ రావు, సంఘ మాజీ అధ్యక్షులు చీరల కృష్ణంరాజు, రావి ప్రసాద్, సూపర్‌వైజర్ పేయ్యేటి బసవరాజ కుమార్, సంఘ వేతన కార్యదర్శులు మట్టా శ్రీనివాసరావు, కృష్ణ, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

మెరైన్ సీఐ బదిలీ



కోడూరు: పాలకాయతిప్ప మెరైన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న వల్లభనేని పవన్‌కిషోర్ గురువారం బదిలీ అయ్యారు. నాలుగు సంవత్సరాల నుంచి పాలకాయతిప్ప స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సాగరతీరానికి వచ్చే భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రతి రోజూ తీరంలో ప్రత్యేక సిబ్బందిని నియమించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పవన్‌కిషోర్ ఏలూరు రేంజ్‌కు బదిలీపై వెళ్లారు. పాలకాయతిప్ప మెరైన్ సిబ్బంది సీఐను ఘనంగా సత్కరించారు.

గంగాభవానీ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



కోడూరు: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కోడూరు గంగాభవాని అమ్మవారికి గురువారం భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు. ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామస్తులు స్థానిక రామాలయం వద్ద నుంచి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. డప్పువాయిద్యాలు, మేళతాళాల నడుమ సారెను భక్తులు ఆలయం చుట్టూ ఊరేగించారు. 21 రకాల పుష్పాలు, చీరలు, గాజులు, పసుపు, కుంకుమ, వివిధ పండ్లను భక్తులు అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఆషాఢ సారె విశిష్టతను వివరించారు. ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



గూడూరు: ఆకులమన్నాడులోని కోదండ రామాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆకులమన్నాడు శివారు కప్పలదొడ్డిపాలెంలోని కోదండ రామాయలంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.